

జెనిత్ ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు

జాహ్నవి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో జెనిత్ ఫెస్ట్ 2025

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ పరమేశ్వర్, వైస్ చైర్ పర్సన్ లక్ష్మిలు అన్నారు. జాహ్నవి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్‌లో నిర్వహించిన 'జెనిత్ ఫెస్ట్ 2025' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, మానవీయ విలువలతో ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, ఫ్యాషన్‌షో, డ్రామాలతో ఆహూతులను అలరించారు. అనంతరం ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు, మెమొంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతన పైపులైన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించిన జలమండలి ఏఈ సురేష్‌కుమార్ తదితరులు

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

ముషీరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని మేదరబస్తీలో కలుషిత నీటి సరఫరా నివారణకు శనివారం జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. కలుషిత నీటి సరఫరాపై 'ఈ నీళ్లు మాకొద్దు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు కలుషిత నీటి సరఫరాకు గల కారణాలను పరిశీలించారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ సురేష్ కుమార్‌లు స్థానికులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కొత్త పైపులైన్లు వేస్తామని అధికారులు స్థానికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు కనకేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డా. రోహిణ్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తదితరులు

కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

- పార్టీ నేత డా. రోహిణ్‌రెడ్డి

నల్లకుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డా.రోహిణ్‌రెడ్డి అన్నారు. శనివారం రోహిణ్‌రెడ్డిని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో యువ నాయకుడు నవీన్‌యాదవ్ విజయం సాధించడమే ఏకైక లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రోహిణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హరినాథ్‌రెడ్డి, విజితారెడ్డి, రోహిత్, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనుల పరిశీలన

చిక్కడపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పునరుద్ధరణ పనులను ఆమె పర్యవేక్షించారు. సకాలంలో పూర్తి డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వినోభానగర్‌లో ప్రహరీ నిర్మాణం

ముషీరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ వినోభానగర్‌లో నాలా ప్రహరీ నిర్మాణ పనులను శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలా ప్రహరీ కూలిపోయిన విషయం తెలిసిందే. కూలిన ప్రహరీ దిమ్మెలను తొలగించి నిర్మాణ పనులను చేపట్టామని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని జీహెచ్‌ఎంసీ ఏఈ మురళీ తెలిపారు. నాలా నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ పరిశీలించారు. నాలా వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

● కలుషిత నీటి సమస్య పరిశీలన



అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కలుషిత నీటి సమస్యను స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జలమండలి అధికారులను ప్రేమ్‌నగర్‌కు పిలిపించి నీటి సమస్యను వివరించారు. వెంటనే కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ విజయ్ అధికారులను కోరారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



కమలానెహ్రూనగర్‌లో భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ డివిజన్ కమలానెహ్రూ నగర్‌లో అమ్మవారి ఆలయం వద్ద బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకుని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ప్రభాకర్, బల్వంత్‌రాజ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాకాళి ఆలయంలో అన్నదానం..

ముషీరాబాద్‌లో ప్రసిద్ధి గాంచిన మహాకాళి అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాగభూషణం గౌడ్, నాయకులు బాలరాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎయిర్‌బంచ్ కేబుల్ ఏర్పాటుకు చర్యలు

- టీజీఎస్పీడీసీఎల్ సీఈ నర్సింలు



బస్తీబాటలో పాల్గొన్న టీజీఎస్పీడీసీఎల్ సీఈ నర్సింలు, ఎస్‌ఈ వెంకన్న తదితరులు

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణగూడ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని అచ్చయ్యనగర్‌లో మూడు కిలోమీటర్ల పొడవున విద్యుత్ ఎయిర్‌బంచ్ కేబుల్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని టీజీఎస్పీడీసీఎల్ సీఈ నర్సింలు, ఎస్‌ఈ వెంకన్న తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ నూతనంగా చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శనివారం నారాయణగూడ ఏడీఈ పరిధిలోని బాగ్‌లింగంపల్లి, అచ్చయ్యనగర్ ప్రాంతాలలో ఆజామాబాద్ డీఈ కమలాకర్, ఏడీఈ వినోద్‌కుమార్, ఏఈ విశ్వనాథ్‌లతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అచ్చయ్యనగర్ ప్రాంతంలో ఎయిర్‌బంచ్ కేబుల్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరారని, వారి విజ్ఞప్తి మేరకు ఎయిర్‌బంచ్ కేబుల్ పనులు చేపడతామన్నారు. కాలనీల్లో విద్యుత్ సమస్యలుంటే వెంటనే తమ సిబ్బందికి తెలియజేయాలని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మట్టిబిడ్డ కొంపెల్లి వెంకట్‌గౌడ్: వక్తలు



కొంపెల్లి వెంకట్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మట్టిబిడ్డ కొంపెల్లి వెంకట్‌గౌడ్ అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని కొనియడారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు కొంపెల్లి వెంకట్‌గౌడ్ సంతాప సభ నిర్వహించారు. జైగౌడ్ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. దళిత బహుజనుల సమస్యలను తన రచనల ద్వారా సమాజానికి తెలియజేసిన రచయిత కొంపెల్లి వెంకట్‌గౌడ్ అని అన్నారు. రావోయే బుక్ ఫెస్టివల్ ప్రాంగణానికి ఆయన పేరు పెట్టాలన్నారు. వెంకట్‌గౌడ్ రాసిన పాపన్న చరిత్రను విరివిగా ప్రజల్లోకి తీసుకురావాలని కోరారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాలరాజుగౌడ్, విశారాదన్ మహరాజ్, సత్యంగౌడ్, నారాయణగౌడ్, వెంకన్నగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, శారదాగౌడ్, లలిత, సురభి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: సతీష్



విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న తెలంగాణ న్యాయ విభాగం అధికారి సతీష్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు కృషి చేయాలని తెలంగాణ న్యాయ విభాగం అధికారి చౌదగిరి సతీష్ అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన 12వ జాతీయ స్థాయి మెగా పోటీల్లో నగరంలోని డీడీ కాలనీ అకాడమిక్ హైట్స్‌కు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 40 కేటగిరీలలో పోటీ పడి ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. శనివారం డీడీ కాలనీలో జరిగిన విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సన్మానించి, వారు సాధించిన ట్రోఫీని పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, అకాడమిక్ హైట్స్ పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సులక్షణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతిచెందిన వ్యక్తి

కవాడిగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ హనుమాన్ ఆలయం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని, మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు దోమలగూడ సీఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దోమలగూడ పీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర బంద్‌కు ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకు పిలుపు మేరకు ఈ నెల 14న జరిగే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఓయూలో ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలుచేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి బీసీ రిజర్వేషన్లకు పరిష్కారాన్ని చూపాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు స్వామిగౌడ్, నాగేశ్వర రావు, ఆంజనేయులు, ఓయూ శంకర్, నిఖిల్, నరేష్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయానికి కృషి చేయాలి

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు



బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావును సన్మానిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకులు కనకేశ్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్/ నల్లకుంట/ రాంనగర్/ అంబర్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని, పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతంరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్ కుమార్, దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రొయ్యూరు శేషసాయి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని గౌతమ్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట డివిజన్ నేతలు దాసోజు నాగభూషణంచారి, నరేష్‌గౌడ్, రాజు, భిక్షపతి, నవీన్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, శ్రీకాంత్, రాజునేత, తిరుపతిగుప్తా, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన డా. గౌతమ్‌రావును పార్టీ నేతలు సన్మానించారు. శనివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, గాంధీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, యువమోర్చా నాయకులు జ్ఞానేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

బర్కత్‌పుర: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అంబర్‌పేట మహాకాళి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బర్కత్‌పుర మీదుగా నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి భారీ ర్యాలీతో వెళ్లారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో, డిసెంబర్‌లో జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, సూర్యప్రకాష్‌సింగ్, నందకిషోర్‌యాదవ్, క్షీరసాగర్, కృష్ణకుమార్, కృష్ణాగౌడ్, యశ్వంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీ లక్ష్మణ్‌కు సన్మానం



పబ్లిక్ ఆకౌంట్స్ కమిటీ భారత రైల్వే కన్వీనర్‌గా నియమితులైన రాజ్యసభ ఎంపీ డా.లక్ష్మణ్‌ను శనివారం ఆయన నివాసంలో బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

నేడు దసరా మిలాప్

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాంనగర్‌లోని ఎస్‌ఆర్‌టీ కమ్యూనిటీ హాల్‌లో దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక మీడియా కన్వీనర్ గజ్జెల సూర్యనారాయణ తెలిపారు. శనివారం రాంనగర్‌లో దసరా మిలాప్ కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. ప్రతియేటా దసరా మిలాప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దళితులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిలాప్ కార్యక్రమ కన్వీనర్లు వివేక్, శ్యాంసుందర్, నవీన్, కృష్ణస్వామి, అరుణ, వెంకటేష్, భాస్కర్, రామస్వామి, పరిమళ్‌కుమార్, సదానంద్, నాయకులు గోపాల్‌దాస్, సతీష్, నరేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఈడీ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ మహిళా నాయకులు హేమ, రమ్యాగౌడ్, సునీత తదితరులు

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి: హేమ

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకురాలు హేమ సుదర్శన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బస్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఈడీ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఏపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు రమ్యాగౌడ్, సునీతలతో కలిసి వారు మాట్లాడారు. పెంచిన బస్ చార్జీలతో పేద ప్రజలు, విద్యార్థులపై అధిక భారం పడుతుందన్నారు. బస్ చార్జీలను తగ్గించకపోతే మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేసే వరకు పోరాడతామన్నారు.

నవీన్‌యాదవ్ గెలుపు ఖాయం



నవీన్‌ను కలిసిన కాంగ్రెస్ నేత కృష్ణగౌడ్

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని పార్టీ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం నవీన్‌యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ రాంబాబు తదితరులు కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



షిరిడీ సాయిబాబా సమాధి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు

ఆధ్యాత్మిక భావనకు సాయి బోధనలు దోహదం

- బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు

కవాడిగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు షిరిడీ సాయిబాబా బోధనలు దోహదపడతాయని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు అన్నారు. కవాడిగూడ సాయిఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షిరిడీ సాయిబాబా 107వ సమాధి ఉత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెన్‌ను శాలువా, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, రవిగౌడ్, నర్సింగ్‌రావు, బాబు, టింకు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మాజీ ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తున్నామని వారు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధేష్, స్వామి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యుఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సప్తగిరి థియేటర్‌లో శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన అరి సినిమా ప్రదర్శన జరుగుతుంది. శనివారం ఎన్‌ఎస్‌యుఐ నేతలు సప్తగిరి థియేటర్ వద్ద సినిమా పోస్టర్లను చింపివేయడంతో పాటు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన రాజు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనగా అతడు అక్కడికక్కడే మరణించిన ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి రైల్ ఓవర్ బ్రిడ్జి కింద జనగామ జిల్లా జఫర్‌గడ్ ప్రాంతానికి చెందిన మండల రాజు(55)శనివారం రైలు పట్టాలు దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి జేబులో లభించిన సెల్ నంబరు ఆధారంగా మృతుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362